జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం
07-08-2026
సంపుటి 1 సంచిక 255
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



4లో

## నకిలీ ఫైర్ ఎన్ఓసీల కలకలం..
56 ఇంటర్ కాలేజీలు గుర్తింపు, మరో 176పై విచారణ




## ఆచార్య జయశంకర్‌కు రాష్ట్రవ్యాప్తంగా
# ఘన నివాళులు
### సేవలను స్మరించిన రాజకీయ నేతలు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఆచార్య జయశంకర్ జీవితాంతం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో దేశం ముందు ఉంచి ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కూడా జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఆయన జీవిత లక్ష్యమని, ఉద్యమానికి బలమైన భావజాలాన్ని అందించిన మహనీయుడని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

..మిగతా 4వ పేజీలో →




### ఆగస్టు 15 నుంచి రేషన్ కార్డులు
బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

### కర్ణాటక ఎఫెక్ట్‌తో తెలంగాణ కేబినెట్ విస్తరణ?
4లో
అసంతృప్తికి ముందస్తు చెక్‌పై కాంగ్రెస్ దృష్టి

ఫోన్ ట్యాపింగ్ కేసు
## తుది దశకు
ఆగస్టు 15న భారీ అదనపు ఛార్జ్‌షీట్?



**దశ, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆగస్టు 15 నాటికి నాంపల్లి కోర్టులో అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా 600 మందికి పైగా బాధితులు, సాక్షుల వాంగ్మూలాలు, ఇప్పటికే అరెస్టైన నిందితుల కన్ఫెషన్ స్టేట్‌మెంట్లు, డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అభియోగపత్రంలో సాధారణ క్రిమినల్ నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టంలోని నిబంధనలను కూడా చేర్చే అవకాశం ఉందని సమాచారం. విచారణలో సేకరించిన

..మిగతా 4వ పేజీలో →



## పోలవరం-బనకచర్లకు
# కేంద్రం బ్రేక్..
### పర్యావరణ ప్రతిపాదన వెనక్కి..

**దశ, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది.ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (EAC) నివేదికల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది. ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడానికి ముందు కేంద్ర జల సంఘం (CWC) ద్వారా గోదావరిలో వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర జల వివాదాలు పరిష్కరించిన అనంతరమే పర్యావరణ అనుమతుల కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు

..మిగతా 4వ పేజీలో →

### నాంపల్లి–లక్డీకాపూల్ మధ్య
## వై ఆకారంలో ఫ్లైఓవర్
### ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారమే లక్ష్యం



**దశ, హైదరాబాద్:** నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టేందుకు నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో వై (Y) ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ తుది దశలో సిద్ధం చేస్తోంది. ప్రతిపాదిత ఫ్లైఓవర్‌ను నాంపల్లిలోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ సమీపం నుంచి పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ వెనుక భాగం, రైల్వే ట్రాక్ వెంట లక్డీకాపూల్ వరకు 1.45 కిలోమీటర్ల పొడవుతో మూడు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌గా నిర్మించనున్నారు. లక్డీకాపూల్ వద్ద

..మిగతా 4వ పేజీలో →



## ఈటెల, బండి మధ్య కుదిరిన సయోధ్య
### 3 జిల్లాల అధ్యక్షులు ఫైనల్
వివరాలు 4లో

## ఇథనాల్ ఛార్జింగ్ సిస్టమ్
### తెలంగాణలో తొలి ఇథనాల్ ఆధారిత ఈవీ ఛార్జింగ్ సిస్టమ్
గ్రీన్ మొబిలిటీలో కొత్త ముందడుగు.

**దశ, హైదరాబాద్ :** దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఛార్జింగ్ మౌలిక వసతుల కొరతకు పరిష్కారంగా తెలంగాణలో దేశంలోనే తొలి ఇథనాల్ ఆధారిత ఈవీ ఫాస్ట్ ఛార్జింగ్ సిస్టమ్ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి సమక్షంలో ఈ వినూత్న సాంకేతికతను ఆవిష్కరించారు. ఈ 150 కిలోవాట్ ఫాస్ట్ ఛార్జింగ్ సిస్టమ్ సంప్రదాయ విద్యుత్ గ్రిడ్‌పై ఆధారపడకుండా ఇథనాల్‌ను ఇంధనంగా ఉపయోగించి అక్కడికక్కడే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆ విద్యుత్‌తో ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలను వేగంగా ఛార్జ్ చేయవచ్చు. దీంతో భారీ పవర్ గ్రిడ్లు, హైవోల్టేజ్ కనెక్షన్ల అవసరం లేకుండా ఛార్జింగ్ సేవలు అందించే అవకాశం కలుగుతుంది.

సాధారణంగా ఒక ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి స్థల సమీకరణ, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రభుత్వ అనుమతులతో నెలల సమయం పడుతుంది. అయితే ఈ మొబైల్ ఇథనాల్ ఛార్జింగ్ యూనిట్‌ను కేవలం 72 గంటల్లో ఎక్కడైనా ఏర్పాటు చేయవచ్చని సంస్థ తెలిపింది. దీంతో మౌలిక సదుపాయాల వ్యయం, సమయం దాదాపు 50 శాతం వరకు తగ్గే అవకాశముంది. హైవేలపై వేగంగా ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఈ సాంకేతికత దోహదపడనుంది. ఇథనాల్‌ను చెరకు, మొక్కజొన్న, వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారు చేయడం వల్ల దీని వినియోగం పెరిగితే రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు

..మిగతా 4వ పేజీలో →



## సిటీలో డిజిటైజేషన్ 56 శాతమే
### ఓటర్ల జాబితాపై రాజకీయ వేడి

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 2002 నాటి ఓటర్ల డేటాబేస్, జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు, ఆధార్ ఆధారిత మ్యాపింగ్‌లో తలెత్తిన వ్యత్యాసాల కారణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పలువురి పేర్లు లేకపోవడంపై ఆందోళనలు

..మిగతా 4వ పేజీలో →


### సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం..
## సమరసతకు చిరునామా

శ్రీ రామానుజుల సమానత్వ సందేశం నేటికీ సజీవం

ముచ్చింతల్‌లో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్ర సందర్శన లో రాష్ట గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా

గవర్నర్ కు శ్రీ రామానుజాచార్యుల వారి జీవిత చరిత్ర పుస్తకాలను బహుకరించిన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి

'ఇది గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి.. సమానత్వ సారాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించాను' అని సందర్శకుల పుస్తకంలో పేర్కొన్న గవర్నర్

**దశ, ముచ్చింతల్. (రంగారెడ్డి )** ముచ్చింతల్‌లోని శ్రీ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఆధ్యాత్మికత, సమరసత, సమానత్వ విలువలకు చిరస్థాయిగా నిలిచే దివ్యక్షేత్రమని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి తొలిసారిగా సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని

..మిగతా 4వ పేజీలో →



## జొన్న రైతులకు రూ. 994 కోట్లు జమ
### 1.01 లక్షల మంది రైతులకు లబ్ధి: మంత్రి తుమ్మల

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలోని జొన్న రైతులకు ప్రభుత్వం రూ.994 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం 1.01 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా జమ చేసినట్లు వెల్లడించారు. తెలంగాణలో జొన్న కొనుగోలు విధానాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దామని

..మిగతా 4వ పేజీలో →

# ఆచార్య జయశంకర్‌కు రాష్ట్రవ్యాప్తంగా ఘన నివాళులు

**మొదటి పేజీ తరువాయి**

జయశంకర్ తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. మరోవైపు కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించి జయశంకర్‌కు నివాళులర్పించడంతో పాటు సామాజిక న్యాయం అమలు చేయాలని డిమాండ్ చేసింది.

## సిద్దిపేటలో హరీశ్ విమర్శలు

సిద్దిపేటలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు చేశారు. కేసీఆర్ పోరాటం, జయశంకర్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు.
గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, గతంలో సాధించిన ప్రాజెక్టు అనుమతులను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు, సమ్మక్క-సారక్క ప్రాజెక్టుల అంశాల్లో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, అవసరమైతే జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఆగస్టు 15 నుంచి రేషన్ కార్డులు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.



## కర్ణాటక ఎఫెక్ట్‌తో కేబినెట్ విస్తరణ?

**దశ, హైదరాబాద్ :** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అనంతరం జరిగిన కేబినెట్ విస్తరణలో తలెత్తిన అసంతృప్తి ప్రభావం తెలంగాణ కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశంగా మారింది. అక్కడ మంత్రివర్గంలో చోటు దక్కని పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు బహిరంగ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు రాజీనామాల వరకు వెళ్లిన పరిణామాలను కాంగ్రెస్ అధిష్ఠానం నిశితంగా పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణలో ఎలాంటి అసమ్మతి తలెత్తకుండా ముందస్తు చర్యలపై దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మంత్రివర్గంలోని ఖాళీల భర్తీతో పాటు కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషణల ప్రకారం, తెలంగాణలో కూడా రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. యువ నాయకత్వానికి అవకాశం కల్పించాలనే ఆలోచనతో పాటు, పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ నేతలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసంతృప్తిని తగ్గించేందుకు మంత్రి పదవులు రాని కీలక నేతలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, నామినేటెడ్ పోస్టులు, జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు లేదా ప్రభుత్వ సలహాదారు వంటి బాధ్యతలు అప్పగించే అవకాశాలపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అలాగే ఉమ్మడి జిల్లాల వారీగా, సామాజిక వర్గాల వారీగా సమతుల్యత దెబ్బతినకుండా మంత్రివర్గ కూర్పును రూపొందించేందుకు కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఈటెల, బండి మధ్య కుదిరిన సయోధ్య

## 3 జిల్లాల అధ్యక్షులు ఫైనల్

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీలో గత కొంతకాలంగా ఆధిపత్య పోరుతో తీవ్ర ఉత్కంఠ రేపిన మూడు జిల్లాల అధ్యక్షుల పీటముడి ఎట్టకేలకు వీడింది. పార్టీ కీలక నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్ వర్గాల నడుమ పట్టుదల కారణంగా పెండింగ్‌లో పడిన కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ (అర్బన్) జిల్లాల అధ్యక్షుల స్థానాలను భర్తీ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ఇరువర్గాల ముఖ్య నేతల మధ్య సుదీర్ఘంగా సాగిన చర్చల అనంతరం సయోధ్య కుదరడంతో... కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యూ. రమేశ్, అలాగే మేడ్చల్ (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డిలను ఎంపిక చేశారు. అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన అభ్యర్థులకే పగ్గాలు అప్పగిస్తూ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

# నాంపల్లి–లక్డీకాపూల్ మధ్య వై ఆకారంలో ఫ్లైఓవర్

**మొదటి పేజీ తరువాయి**

ఈ ఫ్లైఓవర్ రెండు శాఖలుగా విడిపోయి వై ఆకారాన్ని సంతరించుకోనుంది. ఒక శాఖ సుమారు 400 మీటర్ల పొడవుతో రెండు లేన్లలో మాసబ్‌ట్యాంక్ వైపు ఇప్పటికే ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానం కానుండగా, మరో శాఖ 530 మీటర్ల మేర రెండు లేన్లతో ఖైరతాబాద్ వైపు కలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే నాంపల్లి నుంచి వచ్చే వాహనాలు మధ్యలో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగకుండా నేరుగా మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ వైపులకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ మార్గంలో మూడు ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్లు ఉండటంతో పాటు అసెంబ్లీ సమావేశాల సమయంలో తరచూ ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ట్రాఫిక్ అంచనాల కోసం ప్రత్యేక కన్సల్టెన్సీ సంస్థతో సర్వే నిర్వహించగా, ప్రస్తుతం టోపోగ్రఫీ సర్వే తుది దశలో ఉంది. పిల్లర్ల నిర్మాణం, డౌన్ ర్యాంపులు, ప్రభుత్వ భూముల అవసరం, రైల్వే అనుమతులు, అంచనా వ్యయం వంటి వివరాలతో కూడిన డీపీఆర్‌ను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ప్రాజెక్టు అమల్లోకి వస్తే నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# ఇథనాల్ ఛార్జింగ్ సిస్టమ్

**మొదటి పేజీ తరువాయి**

మెరుగైన ధర లభించే అవకాశం ఉంది. అలాగే ముడి చమురు దిగుమతులపై దేశం ఆధారపడటం తగ్గి విదేశీ మారకద్రవ్యం ఆదా కానుంది. డీజిల్ జనరేటర్లతో పోలిస్తే ఈ ఇథనాల్ ఆధారిత వ్యవస్థ కార్బన్ ఉద్గారాలను దాదాపు 80 శాతం వరకు తగ్గించే సామర్థ్యం కలిగి ఉందని సంస్థ తెలిపింది. వాహనంపై సులభంగా తరలించగల ఈ మొబైల్ ఛార్జింగ్ యూనిట్ హైవేలపై బ్యాటరీ ఖాళీ అయిన ఎలక్ట్రిక్ వాహనాలకు అత్యవసర పరిస్థితుల్లో అక్కడికక్కడే ఛార్జింగ్ సేవలు అందించగలదు. గ్రీన్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధన వినియోగం, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి ఈ ఇథనాల్ ఆధారిత ఈవీ ఛార్జింగ్ సాంకేతికత కీలక ముందడుగుగా నిలవనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం.. సమరసతకు చిరునామా

**మొదటి పేజీ తరువాయి**



సందర్శించిన గవర్నర్, ఈ పుణ్యక్షేత్రం తనకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. బ్యాటరీ వాహనంలో స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించిన గవర్నర్ దంపతులు, సమతామూర్తిని దర్శించుకున్నారు. వేద పండితులు గవర్నర్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం 216 అడుగుల ఎత్తైన శ్రీ రామానుజాచార్యుల పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. తదనంతరం సమతా మూర్తి కేంద్రంలోని 108 దివ్యదేశాల విశిష్టతను తెలుసుకున్నారు. కేంద్ర విశేషాలను అహోబిల జీయర్ స్వామి, కృష్ణ స్వామి గవర్నర్ దంపతులకు వివరించారు. హారతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వైకుంఠనాథ భగవానుడిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరగా స్వామీజీ కుటీరంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిని గవర్నర్ దంపతులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీ రామానుజాచార్యుల విశిష్ట సేవలు, విశిష్టాద్వైత తత్వం, సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణ లక్ష్యం, ఇక్కడ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి జీయర్ స్వామి వివరించారు. అనంతరం గవర్నర్ దంపతులను శాలువాతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి సత్కరించి సమతా మూర్తి ప్రతిమ, భగవత్ రామానుజ పుస్తకాన్ని , శ్రీ రామానుజచార్యుల వారి జీవిత చరిత్ర, చిత్ర కథ, సత్య సంకల్ప పుస్తకాలు సహా పలు పుస్తకాలను బహుకరించారు. ఆశీస్సులు అందజేశారు. గవర్నర్ స్వామివారికి మెమెంటో అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, సమతా మూర్తి విగ్రహం సమరసతకు, సామాజిక సమానత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశంలో అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఒకటిగా నిలిచిందన్నారు. వేదాలు బోధించిన విలువలను శ్రీ రామానుజాచార్యులు తమ జీవితంలో ఆచరించి చూపారని కొనియాడారు. వెయ్యేళ్ల క్రితమే జాతి, భాష, వర్ణ భేదాలకు అతీతంగా సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మహనీయుడని పేర్కొన్నారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పి భక్తి ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేసిన మహోన్నత ఆధ్యాత్మిక విప్లవకారుడిగా శ్రీ రామానుజులను అభివర్ణించారు. "దేవుడిని ఆరాధించడం, మోక్షాన్ని పొందడం ప్రతి మానవుడి హక్కు. ఆ హక్కును నిరాకరించే అధికారం ఎవరికీ లేదు. దేవుని దృష్టిలో అందరూ సమానులే" అనే శ్రీ రామానుజాచార్యుల సందేశం యుగయుగాలకు మార్గదర్శకమని గవర్నర్ అన్నారు. వ్యక్తిగత శ్రేయస్సుకంటే సమాజ శ్రేయస్సే ముఖ్యమనే ఆయన బోధనలు నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. సందర్శన అనంతరం సందర్శకుల పుస్తకంలో గవర్నర్ తన అభిప్రాయాన్ని నమోదు చేశారు. "ముచ్చింతల్‌లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని తొలిసారిగా సందర్శించాను. ఈ దివ్యక్షేత్రం నాకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. సమానత్వ సారాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం లభించింది. ఈ మహత్తర కేంద్రాన్ని నిర్మించిన స్వామీజీ, జీయర్ స్వామి, వారి బృందానికి హృదయపూర్వక అభినందనలు" అని రాసి సంతకం చేశారు.

# వెంకటంపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహణ



**దశ, వెంకటంపల్లి:** వెంకటంపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను గ్రామ సర్పంచ్ ఆవునూరు లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యానికి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెలిచాల మల్లేశం, వార్డు సభ్యులు బండ బాబు, పసునూరి స్వరూప, గ్రామ పంచాయతీ కార్యదర్శి బూర నవీన్, జీపీఓ రాధాశేఖర్, అంగన్వాడి టీచర్ బండ అంజలి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆవునూరి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులు, బాలింతలకు గుడ్లు, బాలామృతం, ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర పోషకాహార సామగ్రిని పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత శ్రేయస్కరమని, ప్రతి తల్లి తొలి ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే అందించాలని అధికారులు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు తెలంగాణ రాష్ట్ర సాధనకు జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్

**మొదటి పేజీ తరువాయి**

తరలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపడంతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పురోగతి తాత్కాలికంగా నిలిచిపోయింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు తుది దశకు

**మొదటి పేజీ తరువాయి**


సాంకేతిక ఆధారాల ప్రకారం రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధులు తదితర ప్రముఖుల ఫోన్‌లను నిబంధనలకు విరుద్ధంగా ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. డేటాను ధ్వంసం చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, రికవర్ చేసిన హార్డ్‌డిస్క్‌లు, డిజిటల్ ఆధారాలు, నిందితుల వాంగ్మూలాల ఆధారంగా బలమైన సాక్ష్యాలను సేకరించినట్లు సమాచారం. ఈ అదనపు ఛార్జ్‌షీట్ కేవలం క్రిమినల్ విచారణకే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కొందరు ఉన్నతాధికారుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ కేసులో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్వకుంట్ల తారక రామారావు, తన్నీరు హరీష్ రావు పేర్లు గతంలో రాజకీయ చర్చల్లో వినిపించినప్పటికీ, వారిపై ఎలాంటి అధికారిక అభియోగాలు నమోదు అయ్యాయో లేదా వారి పేర్లు ఛార్జ్‌షీట్‌లో ఉన్నాయో అనే విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. సిట్ అధికారులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ చట్టపరమైన లోపాలు లేకుండా అభియోగపత్రాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఆగస్టు 15న కోర్టులో సమర్పించే అదనపు ఛార్జ్‌షీట్‌లో ఏ వివరాలు ఉంటాయన్నది ఇప్పుడు రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# సిటీలో డిజిటైజేషన్ 56 శాతమే

**మొదటి పేజీ తరువాయి**

వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఫారమ్‌ల డిజిటైజేషన్ మందగమనంలో కొనసాగుతుండగా, గ్రేటర్ హైదరాబాద్‌లో ఇప్పటివరకు కేవలం 56 శాతం డిజిటైజేషన్ మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు) ద్వారా పెద్ద సంఖ్యలో నోటీసులు జారీ కావడంతో ఓటర్లలో అయోమయం నెలకొంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ సర్టిఫికెట్లు, వారసత్వ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేసింది. మీసేవ కేంద్రాల ద్వారా ఈ సేవలు అందుబాటులోకి తెచ్చినా, దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మరియు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బూత్ స్థాయి నాయకులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కూడా కొడంగల్‌తో పాటు కొన్ని నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లు, బహుజనులు, మైనారిటీలు, నిరుపేదలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారని విమర్శించారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించింది. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో డోర్‌టుడోర్ ధృవీకరణ చేపట్టి డేటాను పునఃపరిశీలించాలని ఆదేశించినట్లు సమాచారం.

# నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల కలకలం



**దశ, హైదరాబాద్ :** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. తాజాగా మరో 48 కాలేజీల జాబితాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. ఇప్పటివరకు 56 కాలేజీలు నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు గుర్తించగా, మరో 176 కాలేజీలపై విచారణ కొనసాగుతోంది.విచారణలో ఒకే నమూనాలో నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాలకు ఫైర్ ఎన్‌ఓసీలు హైడ్రా ద్వారా ఆఫ్‌లైన్‌లో జారీ అవుతున్న నేపథ్యంలో, ఆ ప్రక్రియను దుర్వినియోగం చేసి కొందరు కళాశాల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీ ఎన్‌ఓసీలు తయారు చేసి వాటిని ఇంటర్ బోర్డుకు సమర్పించినట్లు విచారణలో తేలింది. ఇందుకోసం ఒక్కో కాలేజీ యాజమాన్యం రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం.అంతేకాకుండా, జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్ శాఖ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత కాలేజీ యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.హైడ్రా నివేదికతో పాటు పోలీసుల దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు సంబంధిత కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# జొన్న రైతులకు రూ. 994 కోట్లు జమ

**మొదటి పేజీ తరువాయి**

మంత్రి పేర్కొన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)తో రికార్డు స్థాయిలో జొన్నలను కొనుగోలు చేస్తున్నామని, రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అలాగే ఎరువుల విక్రయాలను పూర్తిగా డిజిటల్ విధానంలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులు ఆధార్ ఆధారంగా ఎరువులు కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని, రియల్‌టైమ్ స్టాక్ సమాచారం అందుబాటులో ఉండటంతో బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతోందని వివరించారు. FFS వ్యవస్థను మరో పది జిల్లాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణపై అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను వెంటనే అందించాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. యువ ఆవిష్కర్తలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ హ్యాకథాన్-2026లో జాతీయ ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి వగ్గు శ్రీరామ్ను అభినందిస్తూ సన్మానించారు. నేతన్నల కోసం రూపొందించిన వినూత్న 'ఎర్గోనామిక్ బ్యాక్ సపోర్ట్' పరికరాన్ని మంత్రి ఆవిష్కరించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com